నమస్తే తెలంగాణ

ములుగు

జయశంకర్ భూపాలపల్లి

5 మంగళవారం 13 ఫిబ్రవరి 2024 MULUGU JAYASHANKAR BHUPALPALLY




కొండగొర్రె పిల్లను స్వాధీనం చేసుకుంటున్న బీట్ అధికారి బక్కయ్య

## కొండగొర్రె పిల్ల అప్పగింత

తాడ్వాయి, ఫిబ్రవరి 12 : పశువులతో కలిసి గ్రామంలోకి వచ్చిన కొండగొర్రె పిల్లను గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు అప్పగించారు. మండలంలోని కాటాపురం గ్రామానికి చెందిన పశువుల కాపరి సోమవారం పశువులను గ్రామ సమీపంలోని అడవిలోకి మేతకు తీసుకువెళ్లాడు. తిరిగి పశువులు ఇంటికి వస్తున్న క్రమంలో వాటితో పాటు కొండగొర్రె పిల్ల గ్రామంలోకి వచ్చింది. గమనించిన స్థానికులు ఫారెస్టు బీట్ అధికారి కుడుములు బక్కయ్యకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు గ్రామానికి చేరుకొని పశువుల కాపరి నుంచి దానిని స్వాధీనం చేసుకున్నారు. చిన్న పిల్ల కావడంతో దానిని హనుమకొండలోని జూపార్క్‌కు తరలిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

# ఉసురు తీసిన ఉచ్చు

**రెండు చోట్ల యువకులను బలిగొన్న కరెంట్ తీగలు**

**కాటారం అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చుకు బలైన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్**

**కూంబింగ్ చేస్తుండగా దుర్ఘటన**

**దుంపిల్లగూడెం అటవీప్రాంతంలో గొర్రెలను వెతకబోయి యువకుడి మృత్యువాత**

**ఐదు నెలల క్రితమే పెళ్లి.. అంతలోనే ఘోరం**

ఇద్దరూ యువకులు.. విధి నిర్వహణలో అటవీ ప్రాంతాన్ని జల్లెడపడుతూ ఒకరు, స్నేహితుడి జీవనాధారమైన మూగజీవాలను వెతుక్కుంటూ వెళ్లి మరొకరు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చుకు తగిలి బలయ్యారు. ఆదివారం రాత్రి జయశంకర్ జిల్లా కాటారం అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్, ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం దుంపిల్లగూడెం అటవీ పరిధిలో ఓ చిరుద్యోగి కరెంట్ తీగలకు తగిలి మృత్యువాత పడడంతో ఇద్దరి కుటుంబాలు పెద్దదిక్కులను కోల్పోయాయి.

– కాటారం/ గోవిందరావుపేట, ఫిబ్రవరి12



ప్రవీణ్ (ఫైల్)




ఉచ్చు కోసం వేటగాళ్లు అమర్చిన సెంట్రింగ్ వైరు

మావోయిస్టుల సంచారం, మంగళవారం సీఎం, మంత్రుల మేడిగడ్డ పర్యటన నేపథ్యంలో జాతీయ రహదారి వెంట కాటారం అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం రాజోలుగూడకు చెందిన 2012 బ్యాచ్ గ్రేహౌండ్స్ విభాగం జూనియర్ కమాండర్ ఆడే ప్రవీణ్ (34) కూంబింగ్ విధుల్లో ఉన్నాడు. ఆదివారం రాత్రి 30 మందితో కూడిన గ్రేహౌండ్స్ బృందం అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతుండగా జంతువులను వేటాడేందుకు భూమికి రెండు ఫీట్ల ఎత్తులో సెంట్రింగ్ వైరుతో వేటగాళ్లు అమర్చిన కరెంట్ ఉచ్చుకు తగిలి ప్రవీణ్ అపస్మారక స్థితికి వెళ్లాడు. అతడి చేతిపై వైరు లోతుగా దిగింది. తోటికానిస్టేబుళ్లు ఉన్నతాధికారులు, స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నాగార్జునరావు, ఎస్ఐ అభినవ్, గ్రేహౌండ్స్ కమాండోలు ప్రవీణ్‌ను 108 అంబులెన్స్‌లో భూపాలపల్లికి తరలిస్తుండగా మధ్యలోనే చనిపోయాడు. అతడికి భార్య లత, ఇద్దరు కొడుకులు హర్ష, వివాన్ ఉన్నారు. ప్రవీణ్ వెంట ఉన్న గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

### అటవీప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ, ఓఎస్డీ

ఘటనా స్థలాన్ని ఎస్పీ కిరణ్‌ఖరే, ఓఎస్డీ అశోక్‌కుమార్, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, రేంజర్ కిరణ్, అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. ఉచ్చు ఏర్పాటు చేసిన వారిలో ఒకరిని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

### గొర్రెలను వెతికేందుకు స్నేహితునితో వెళ్లి..



రమేశ్ (ఫైల్)

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం దుంపిల్లగూడేనికి చెందిన పిండి రమేశ్ (28), అతడి స్నేహితుడు మాదారపు అనిల్ తమ గొర్రెలు తప్పిపోయాయని చెప్పడంతో వెతికేందుకు ఇద్దరూ కలిసి ఆదివారం సాయంత్రం అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. రాత్రి సమయంలో జంతువులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి రమేశ్ అక్కడికక్కడే చనిపోయాడు. అనిల్ ఊరిలోకి వచ్చి విషయాన్ని రమేశ్ బంధువులకు, పోలీసులకు తెలిపాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని, సీఐ శంకర్, ఎస్ఐ షేక్ మస్తాన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రమేశ్ ఓ ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగి కాగా, అతడికి ఐదునెలల క్రితమే వివాహమైంది. మృతదేహం వద్ద అతడి భార్య రోదించిన తీరు స్థానికులను కలిచివేసింది.

# బాధ్యతారహితంగా కాంగ్రెస్ పాలన

- కృష్ణా జలాలను కేంద్రానికి తాకట్టు పెట్టింది
- పదేళ్లు తెలంగాణను కాపాడిన ఉద్యమ నేత కేసీఆర్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఫిబ్రవరి 12: కృష్ణా జలాలను కేంద్రానికి తాకట్టు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగానికి తీరని అన్యాయం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం పుట్టిందే వలస పాలకుల నీటి దోపిడీకి వ్యతిరేకంగా అన్నారు. ఉద్యమ నేత కేసీఆర్ పోరాట ఫలితంగా స్వరాష్ట్రం ఏర్పడిందన్నారు. గత పదేళ్లుగా వ్యవసాయానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కృష్ణా జలాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయాలని యత్నిస్తే అడ్డుకట్ట వేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే నాగార్జునసాగర్ జలాలను కేఆర్ఎంబీకి అప్పజెప్పడం బాధ్యతారాహిత్యమన్నారు. దీంతో ఐదు ఉమ్మడి జిల్లాలు ఎడారిగా మారే పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణా జలాలపై మంగళవారం నల్లగొండలో బీఆర్ఎస్ బహిరంగ సభ ఏర్పాటు చేసిందన్నారు. దీనికి భయపడిన కాంగ్రెస్ ప్రభుత్వం తాము నాగార్జునసాగర్ డ్యామ్ నిర్వహణను కేంద్రానికి అప్పగించలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎర్రబెల్లి అన్నారు. అమలు కానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని ప్రజలు నెల రోజుల్లోనే తెలుసుకున్నారని వివరించారు. ఐదు గ్యారెంటీలు అమలు కావనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు.

### రైతులందరికీ అందని పంట సాయం..

రైతుబంధు పథకం డబ్బులు నేటికీ రైతులందరికీ అందలేదని, దీంతో అనేక మంది ప్రైవేట్ వడ్డీ వ్యాపారాలను ఆశ్రయిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి అన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నల్లగొండ సభలో వివరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభకు పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు వేలాదిగా తరలివాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, బీఆర్ఎస్ మండల నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, బస్వ మల్లేశ్, వైస్ ఎంపీపీ, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, సీతారాంపురం గ్రామ అధ్యక్షుడు బస్వ వెంకన్న, చౌడూరు మాజీ ఉపసర్పంచ్ మేకల యాదగిరి, నాయకులు ఆలకుంట్ల యాదగిరి, హనుమంతు, వీరస్వామి, కారుపోతుల యాదగిరి, యాకూబ్ పాషా, ఆవుల వీరన్న, ఉమేశ్, కుమార్, వరికెల శివాజీ తదితరులు పాల్గొన్నారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్

# మంత్రులు, ఎమ్మెల్యేల్లో ఓరుగల్లు పౌరుషం లేదు

కాకతీయ తోరణం తొలగింపును అడ్డుకోవడం లేదు

రాజముద్రను మార్చితే ఉద్యమిస్తాం

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

**మన నీళ్ల కోసం మళ్లీ ఉద్యమం.. నల్లగొండ సభకు భారీగా తరలిరావాలి**

**బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ పిలుపు**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 12: 'మన మంత్రులు సీతక్క, సురేఖ, కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఓరుగల్లు పౌరుషం కనిపించడం లేదు.. రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రలో కాకతీయ తోరణాన్ని తొలగిస్తామంటే అడ్డుకోవడంలేదు.. రాజముద్రను మార్చితే ఉద్యమిస్తాం' అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ హెచ్చరించారు. హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్‌తో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ చరిత్రను మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కాకతీయుల కళావైభవానికి చిహ్నంగా నిలిచే కళాతోరణాన్ని కొనసాగించకుంటే ఓరుగల్లు నుంచే పోరాటాలు చేపడతామన్నారు. కాకతీయులు నిర్మించిన గొలుసుకట్టు చెరువులను కేసీఆర్ మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా పూడికతీయించి సాగునీరు అందించారని గుర్తుచేశారు. ప్లేగువ్యాధి అంతరించినందుకు గుర్తుగా నిర్మించిన చార్మినార్ చిహ్నాన్ని తొలగిస్తామనడం మైనార్టీల మనోభావాలు దెబ్బతినేలా చేయడమేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో కాకతీయ తోరణం, చార్మినార్ తొలగిస్తామనడం సరికాదని, వెంటనే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి, తెలంగాణ చిహ్నంలో మార్పులు చేస్తామని చెప్పడం కూడా సరైంది కాదన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే పనికిరాని పనులు చేస్తున్నాడని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడుతామని చెప్పారు.

### నల్లగొండ నుంచే పోరాటం

**– బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్**

నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ రాజకీయ పార్టీగా ఎదిగిందని, కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కోటి ఎకరాలకు నీళ్లు అందించారని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృష్ణా ప్రాజెక్టును కేంద్రానికి అప్పగిస్తున్నారని, మన నీళ్ల కోసం మరో ఉద్యమం చేయాలని, ఇందుకు నల్లగొండ సభ నుంచే బీఆర్ఎస్ పోరాటాలకు సిద్ధమవుతున్నదని చెప్పారు. మార్పు అంటూ చిహ్నాలు మార్చుతున్నారని, సాగునీటి ద్వారా లక్షల ఎకరాల్లో ధాన్యం పండించిన రైతులకు రైతుబంధు ఇవ్వకుండా ఆపారని విమర్శించారు. సంపద పెంచి, పేదలకు పంచాలన్న ఉద్దేశంతో ఉద్యమనేత కేసీఆర్ రైతుబంధును అందిస్తే, సీఎం రేవంత్‌రెడ్డి దళితబంధు, బీసీ, మైనార్టీబంధు మొత్తానికే నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేసేందుకు ఉద్యమిస్తామని, ప్రజలంతా నల్లగొండ సభకు స్వచ్ఛందంగా తరలిరావాలని, అక్కడి నుంచే బీఆర్ఎస్ పోరాటం ప్రారంభిస్తుందని తెలిపారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్ యాదవ్, రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, పులి రజినీకాంత్, కోన శ్రీకర్, పానుగంటి శ్రీధర్ పాల్గొన్నారు.

# నేడు మేడిగడ్డకు సీఎం రేవంత్‌రెడ్డి

- **మంత్రులు, 50మంది ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి బరాజ్ పరిశీలన**
- **బరాజ్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్**
- **ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ, కలెక్టర్, ఎస్పీ**

మహదేవపూర్, ఫిబ్రవరి 12: ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌ను సందర్శించనున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 10గంటలకు సుమారు 40 ప్రత్యేక బస్సుల్లో 50 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో ఉన్న మేడిగడ్డకు రానున్నారు. బరాజ్‌లో కుంగిన పియర్‌లను పరిశీలించిన అనంతరం అధికారులతో సమీక్షించనున్నారు. బరాజ్‌పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్(పీపీటీ) ఇవ్వనున్నారు. ఈమేరకు సుమారు 2వేల మంది కూర్చునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు మేడిగడ్డ వద్ద సభా ప్రాంగణం, వేదిక, హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. భద్రతా ఏర్పాట్లను సోమవారం ఐజీ శ్రీనివాస్, కలెక్టర్ భవేశ్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పలు శాఖల అధికారులతో కలిసి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బరాజ్ పరిసరాలను పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, డీఈ సురేశ్, ఎంపీడీవో రవీంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య పాల్గొన్నారు.



మేడిగడ్డ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ శ్రీనివాస్, కలెక్టర్ భవేశ్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖరే, అధికారులు

### సీఎం పర్యటన షెడ్యూల్

- ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరి మధ్యాహ్నం మేడిగడ్డకు 2గంటలకు రాక
- మధ్యాహ్నం 2 నుంచి 3గంటల వరకు బరాజ్ పరిశీలన
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం
- 4 నుంచి 5గంటల వరకు మీడియా సమావేశం
- తిరిగి సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు

### జడ్పీ సీఈవోలు, డీఆర్డీవోల బదిలీలు

హనుమకొండ చౌరస్తా: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో భారీగా బదిలీలు అయ్యాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ బదిలీలను చేపట్టింది. భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ సీఈవోగా పనిచేస్తున్న ఎం.విద్యాలతను హనుమకొండకు, హనుమకొండలో పనిచేస్తున్న ఎస్. వెంకటేశ్వర్‌రావు ములుగుకు, ములుగు జడ్పీ సీఈవో ప్రసూ నారాణి భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీ అయ్యారు. హనుమకొండ డీఆర్డీవో ఎ.శ్రీనివాస్‌కుమార్ ములుగుకు, భూపాలపల్లి జిల్లా డీఆర్డీవో డి.పురుషోత్తం మహబూబాబాద్‌కు, ములుగు డీఆర్డీవో కె.నాగపద్మజ హనుమకొండకు, వరంగల్ డీఆర్డీవో ఎం.సంపత్‌రావు జగిత్యాలకు, సిద్ధిపేట అడిషనల్ డీఆర్డీ వో జె.కౌసల్యాదేవి వరంగల్ డీఆర్డీవోగా నియమితులయ్యారు. జనగామ జడ్పీ డిప్యూటీ సీఈవో వసంత వికారాబాద్‌కు, కరీంనగర్ నుంచి పవన్‌కుమార్ వరంగల్‌కు, మేడ్చల్ మల్కాజ్‌గిరి నుంచి సరిత జనగామకు, వరంగల్ నుంచి సాహితీ మిత్ర భూపాలపల్లి జడ్పీ డిప్యూటీ సీఈవోగా బదిలీ అయ్యారు. మహబూబాబాద్ అడిషనల్ పీడీ వెంకట్‌ను వ్యవసాయ శాఖకు పంపించారు. ములుగు అడిషనల్ డీఆర్డీవో సిద్ధిపేటకు, వరంగల్ అడిషనల్ డీఆర్డీవో భూపాలపల్లి జిల్లా కు నియమితుల య్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ హనుమకొండకు, హను మకొండ డీపీవో వి.జగదీశ్వర్ ములుగుకు, భూపాలపల్లి డీపీ వో ఆర్.లత పెద్దపల్లికి, ములుగు డీఈవో కొండా వెంకయ్య మేడ్చల్ మల్కాజ్‌గిరికి, వీ నారాయణరావు భూపాలపల్లి డీపీ వోగా బదిలీ అయ్యారు.

# రేపు మేడారంలో మండె మెలిగే పండుగ

**వైభవంగా నిర్వహించనున్న పూజారులు**

**మహా జాతర ప్రారంభమైనట్లు సంకేతాలు**

తాడ్వాయి, ఫిబ్రవరి 12 : పూజారులు రేపు (బుధవారం) మేడారంలోని సమ్మక్క-కన్నెపల్లిలోని సారలమ్మ పూజా మందిరాల్లో మండె మెలిగే పండుగ నిర్వహించనున్నారు. మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవార్ల మహా జాతరకు ముందు వచ్చే బుధవారం గుడి మెలిగే పండగను నిర్వహించారు. అనంతరం వచ్చే బుధవారం మండె మెలిగే పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. సమ్మక్క పూజా మందిరంలో సిద్దబోయిన వంశస్తులు, సారలమ్మ ఆలయంలో కాక వంశీయులు పండుగను వైభవంగా నిర్వహించనున్నారు. మొదట తల్లుల గద్దెల వద్దకు వెళ్లి పూజారులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ప్రధాన పూజారి సిద్దబోయిన మునీందర్ ఇంటికి చేరుకుని అక్కడి నుంచి పసుపు, కుంకుమ, మామిడి తోరణాలతో తరలివచ్చి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం గ్రామంలోకి ఎలాంటి దుష్టశక్తులు రాకుండా ప్రధాన రహదారులకు బూరుగు చెట్టు కర్రలతో ధ్వజ స్తంభాలకు మామిడి తోరణాలు, కోడి పిల్లలను కట్టి కట్టడి ఏర్పాటు చేస్తారు. సమ్మక్క పూజా మందిరానికి చేరుకుని తల్లి గద్దె, గుడిని శుద్ధి చేస్తారు. సమ్మక్క పూజారి కొక్కెర కృష్ణయ్య, సారలమ్మ పూజారులు కాక సారయ్య, కిరణ్ భద్రపరిచిన పూజా సామగ్రిని శుద్ధి చేసి తల్లులకు ప్రత్యేక పూజలు చేస్తారు. దూప, దీప నైవేద్యం సమర్పించి అమ్మవార్ల మహా జాతర ప్రారంభమైనట్లు పూజారులు సంకేతాలు ఇస్తారు. వచ్చే బుధవారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని తల్లిని గద్దెపైకి తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. ఈ మండె మెలిగే పండుగతో ప్రారంభమైన పూజలు మహాజాతర ముగిసిన అనంతరం వచ్చే బుధవారం నిర్వహించే తిరుగువారం పండుగ వరకు కొనసాగుతాయి. పూజల అనంతరం గద్దెల వద్దకు కన్నెపల్లి నుంచి సారక్క పూజారులు బయలుదేరి వచ్చి సిద్దబోయిన, కాక వంశీయులు ఒకరికి ఒకరు సాకను ఇచ్చిపుచ్చుకుంటారు. రాత్రంతా పూజలు నిర్వహిస్తూ జాగరణ చేస్తారు. వేకువజామున సమ్మక్క-సారలమ్మ పూజా మందిరాల వద్దకు చేరుకుని తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజారులు, వారి కుటుంబ సభ్యులు కాళ్లకు చెప్పులు లేకుండా పదిహేను రోజులపాటు అత్యంత నియమ నిష్టలు పాటిస్తారు.



కన్నెపల్లిలోని సారక్క దేవత పూజామందిరం



మేడారంలోని సమ్మక్క దేవత ఆలయం

# పోటెత్తిన ఎర్ర బంగారం

**కేసముద్రం మార్కెట్‌కు ఒక్కరోజే 8వేల బస్తాల రాక**

**ఈ కారణంతో కొనుగోళ్లను వాయిదా వేసిన వ్యాపారులు**

**రెండు రోజులు మార్కెట్‌కు సెలవు**

**మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్న రైతులు**

కేసముద్రం, ఫిబ్రవరి 12 : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ఎర్రబంగారం పోటెత్తింది. ఒక్క రోజే సుమారు 8వేల మిర్చి బస్తాలు విక్రయానికి వచ్చాయి. మార్కెట్‌కు పరిమితికి మించి మిర్చి రావడంతో వ్యాపారులు ఈ టెండర్ వేలం పాటలను ఆలస్యం చేశారు. మధ్యాహ్నం ఒంటిగంటకు విడుదల కావాల్సిన ఈ టెండర్‌ను సాయంత్రం 5గంటలకు విడుదల చేశారు. 'ఈ నామ్' విధానం ద్వారా టెండర్ వేసి మధ్యాహ్నం తర్వాత కాంటాలు పెట్టాల్సి ఉంది. అయితే భారీగా మిర్చి బస్తాలు రావడాన్ని సాకుగా చూపుతూ వ్యాపారులు మిర్చి కొనుగోళ్లను వాయిదా వేశారు. సోమవారం టెండర్ వేసి, మంగళవారం కాంటాలు నిర్వహించనున్నారు. కొనుగోళ్లను వాయిదా వేయడంతో రైతులు మార్కెట్‌లోనే రెండు రోజులు పడిగాపులుగాయాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాపారులు కావాలనే మిర్చి కొనుగోళ్లను వాయిదా వేసి, ధరలు తగ్గించి కొనుగోలు చేయాలని చూస్తున్నారని రైతులు వాపోయారు. క్వింటాల్ మిర్చికి గరిష్ఠంగా రూ.21,809, కనిష్ఠంగా రూ.10వేల ధర పలికింది. పరిమితికి మించి మిర్చి విక్రయానికి రావడంతో అధికారులు 13, 14 తేదీల్లో సెలవు ప్రకటించారు. 15న ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



విక్రయానికి వచ్చిన మిర్చి

### దేశీరకం మిర్చి @ రూ.40వేలు

**ఎనుమాముల మార్కెట్‌లో ఈ సీజన్‌లోనే రికార్డు ధర**

కాశీబుగ్గ: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం దేశీరకం మిర్చి ధర రికార్డు స్థాయిలో క్వింటాల్‌కు రూ.40వేలు పలికింది. సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.25వేలు ఉండగా క్రమంగా పెరుగుతూ ఇటీవల రూ.38వేలు పలికింది. సోమవారం కర్నూలు జిల్లాకు చెందిన రైతు బి.అలీపీర్ దేశీ రకం మిర్చి 40 బస్తాలు తీసుకురాగా హారిక ట్రేడింగ్ కంపెనీ అడ్తి ద్వారా ఖరీదు వ్యాపారి సాయి మహేశ్వర్ కొనుగోలు చేశాడు. 500 బస్తాలు రాగా అత్యధికంగా క్వింటాల్‌కు రూ.40వేలు, మధ్య రకం రూ.37వేలు, కనిష్ఠంగా రూ.30వేలు ధరలు పలికాయి. ఈ సీజన్‌లోనే అత్యధికంగా ధరలు పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సుమారు 40వేల మిర్చి బస్తాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### జంపన్నవాగులోకి లక్నవరం నీటి విడుదల



గోవిందరావుపేట, ఫిబ్రవరి12 : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల పుణ్య స్నానాల కోసం మండలంలోని లక్నవరం సరస్సు నుంచి జంపన్నవాగులోకి సోమవారం నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం లక్నవరం సరస్సులో 24.7 అడుగుల నీటిమట్టం ఉందని ఐబీ డీఈ శ్రీనివాస్ తెలిపారు. దయ్యాల వాగులో నీటిమట్టం లేకపోవడంతో జంపన్నవాగులోకి నీరు వెళ్లేలా సరస్సును క్రమక్రమంగా నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు. 20వ తేదీ నాటికి జంపన్నవాగులో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.